క్లుప్తంగా

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన 'రాయల'

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన రాయల నాగేశ్వరరావు శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రాయలను వారు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ దుర్గాప్రసాద్, ఎమ్మెల్యేలు మాలోత్ రాందాస్‌నాయక్, మట్టా రాగమయి, తెల్లం వెంకట్రావు, ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షులు జావీద్, వడ్డే నారాయణరావు, మోతుకూరి ధర్మారావు, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడిని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

రఘునాథపాలెం: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్‌ను జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా శుక్రవారం రఘునాథపాలెం మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు మాలోత్ వీరునాయక్ ఆధ్వర్యాన గిరిజన సంఘం నాయకులు కలిశారు. ఈ సందర్భంగా మండలంలో పలు సమస్యలపై సభ్యుడికి వివరించినట్లు వీరునాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోడ భాస్కర్, సునావత్ వీరు, ధరవాత్ మదన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటల పరిశీలన

నేలకొండపల్లి: మండలంలోని గువ్వలగూడెంలో సాగు చేసిన పత్తి పంటలను వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎస్.విజయచంద్ర శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటలో ఎరువులు చల్లే విధానంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దారి ఆక్రమణ పంచాయితీకి పరిష్కారం

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురం గ్రామపంచాయతీలో ఓ వీధిలో రహదారి ఆక్రమణ చేశారని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో స్థానిక పంచాయతీ కార్యదర్శి నోటీసులు అందించారు. కానీ వారు సదరు పంచాయతీ కార్యదర్శి కక్ష సాధింపు పాల్పడుతున్నారని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ అధికారులు డ్రెయినేజీ తీయించేందుకు వెళ్లగా అడ్డుకున్నారు. దీంతో శుక్రవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివ, ఎస్సై తోట నాగరాజులు ఘటనా స్థలానికి చేరుకుని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆ తర్వాత అధికారులు సమక్షంలో జేసీబీతో డ్రెయిన్ పనులు చేపట్టారు.

వయోవృద్ధుల సంక్షేమానికి కృషి చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని సీనియర్ సిటిజన్స్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వెలిగెటి చంద్రమోహన్ తెలిపారు. శుక్రవారం సంఘ కార్యాలయంలో జరిగిన ఎగ్జిక్యూటివ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 28న సంస్థ కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అసోసియేట్ అధ్యక్షుడు ఆర్.రవీందర్‌రావు, ప్రధాన కార్యదర్శి సాధినేని జనార్దన్‌రావు, సభ్యులు పుల్లారావు, నరసయ్య, నాగేశ్వరావు, ఉపేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీహరి, టి.జనార్దన్, లక్ష్మయ్య, పాల్గొన్నారు.

51వ డివిజన్‌లో డ్రైడే



నిల్వ నీటిని పారబోస్తున్న కార్పొరేటర్

ఖమ్మంమయూరిసెంటర్: మాన్‌సూన్ సీజన్ ప్రారంభమై విష జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యాన స్థానిక 51 డివిజన్‌లో కార్పొరేటర్ శీలంశెట్టి రమావీరభద్రం ఆధ్వర్యాన శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో ఇంటింటికి తిరిగి నిల్వ నీటిని తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు పుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శీలంశెట్టి వీరభద్రం, కేఎంసీ సిబ్బంది, ఆర్పీ, అంగన్‌వాడీలు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డెయిరీలో నర్సింగ్ విద్యార్థినులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం రోటరీనగర్‌లోని ప్రభుత్వ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ విజయ డెయిరీని భద్రాద్రి జిల్లా కొత్తగూడెంకు చెందిన సింగరేణి నర్సింగ్ కాలేజీ విద్యార్థినులు శుక్రవారం సందర్శించారు. విజ్ఞాన యాత్రలో భాగంగా డెయిరీకి వచ్చిన వారు పరిశ్రమలో పాల శీతలీకరణ, శుద్ధి, నిల్వ, ప్యాకింగ్ తదితర అంశాలను పరిశీలించగా అధికారులు వారికి వివరాలు వెల్లడించారు.

అతివకు అందలం..!

మహిళా సాధికారతకు ప్రోత్సాహక రుణాలు

- కొత్త సభ్యులు చేరేలా విస్తృత ప్రచారం
- ప్రతీ మహిళకు సభ్యత్వం ఉండేలా కార్యాచరణ
- లక్ష్యం దిశగా ఐకేపీ అధికారుల కసరత్తు
- ఈ ఏడాది లక్ష్యం రూ.59 కోట్ల రుణాలు

ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోంది. వారికి సకల సదుపాయాలు కల్పించడంతో పాటు వ్యాపారపరంగా రాణించేందుకు అనేక రకాల అవకాశాలు కల్పిస్తోంది. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు మరికొంత మందికి అందించాలనే ఉద్దేశంతో నూతన సభ్యత్వాలు, నూతన పొదుపు సంఘాలను ప్రోత్సాహించే దిశలో అధికారులు అడుగులు వేస్తున్నారు. కొత్త సభ్యత్వాలు, చిన్న సంఘాల ఏర్పాటు ప్రక్రియ నిరంతరంగా సాగుతున్న నేపథ్యాన ప్రతీ మహిళకు సభ్యత్వం ఉండేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇందుకు లక్ష్యాలను సైతం విధించడం విశేషం.

నేలకొండపల్లి: మండలంలోని 32 గ్రామపంచాయతీల్లో 1,361 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఇందులో మొత్తం 13,800 మంది మహిళా సభ్యులు ఉన్నారు. అయితే ఇప్పటివరకు ఏ పొదుపు సంఘాలలో లేని వారిని గుర్తించి సభ్యత్వం కల్పించేలా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా యాక్టివ్‌గా ఉన్న సంఘాలతో పాటు కొత్త సంఘాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ లక్ష్యాలను చేరుకునేలా రుణాలు అందించనున్నారు.



బైరవునిపల్లిలో సంఘం సభ్యుల సమావేశం

కొత్త కోడళ్లకు అవకాశం..

లక్ష్య సాధనలో గ్రామాల వారీగా కొత్తగా సంఘంలో సభ్యులను చేర్పిస్తున్నారు. ఇందుకోసం అధికారులు ఐకేపీ అధికారులు వివిధ రకాల ప్రణాళికలు రూపొందిస్తూ కసరత్తు చేస్తున్నారు. 60 ఏళ్ల దాటిన సభ్యులకు ఆయా సంఘాల నుంచి సభ్యత్వాన్ని రద్దు చేస్తుండడంతో కొత్తగా వారిని చేర్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మండలంలోని ఇప్పటి వరకు దాదాపు 200 మంది సభ్యులను చేర్పించారు. ఇందులో దాదాపు 90 శాతం మంది కొత్త కోడళ్లే ఉన్నారు. వారికి ఇదొక మంచి అవకాశం కానుంది.

మహిళా అభ్యున్నతికి కృషి..

మహిళలను ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ఐకేపీ సరికొత్త ప్రయోగాలు చేస్తున్నారు. సభ్యులకు బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాలను అందిస్తూ చేయూతనిస్తున్నారు. ఇందు కోసం సంబంధిత అధికారులు స్థానికంగా అంతకు ముందు ఉన్న గ్రామ సమాఖ్య సంఘాల సహకారం తీసుకుని నూతన సభ్యులను చేర్పించే ప్రక్రియకు పూనుకున్నారు.

ఈ ఏడాది మండలంలోని యాక్టివ్‌గా ఉన్న 1,128 స్వయం సహాయక సంఘాలకు రూ.59.35 కోట్ల రుణాలు అందించనున్నారు. ఇందులో ఇప్పటికే 104 గ్రూపులకు రూ.11.90 కోట్లను అందించారు. మార్చి నాటికి ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేసేలా స్వయం సహాయక సంఘాల సీసీలు, గ్రామ దీపికలు, గ్రామ సమాఖ్య అధ్యక్షులు రుణాలు ఇప్పించేందుకు విస్తృత ప్రచారం చేస్తున్నారు. దీంతో మండలంలోని రాజేశ్వరపురం, నేలకొండపల్లి, చెరువుమాధారం బ్యాంక్‌ల వద్ద మహిళల సందడి వాతావరణం నెలకొంది.

1,128 సంఘాలు.. రూ.59 కోట్ల రుణాలు..

సద్వినియోగం చేసుకోవాలి..



నూతన సంఘాలలో సభ్యులను చేర్పించేందుకు అవకాశం కల్పించారు. కావునా మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. రుణాలు పొంది ఆర్థికాభివృద్ధి సాధించాలి. ఈ ఏడాది మండలం టార్గెట్ రూ.59 కోట్ల రుణాలను మార్చి నాటికి పూర్తి చేస్తాం.

– కె.అశోక్‌రాణి, ఐకేపీ ఏపీఎం, నేలకొండపల్లి

విస్తృత ప్రచారం చేస్తున్నాం..



మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలపై విస్తత ప్రచారం చేస్తున్నాం. కొత్తగా వచ్చే కోడళ్లను సైతం సభ్యులుగా చేర్చుకునేందుకు ఇంటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం. కొత్త సభ్యులు చేరికకు మంచి స్పందన వస్తుంది.

– ఎం.శైలజ, గ్రామదీపిక, బైరవునిపల్లి

మహిళలకు పెద్దపేట..



తెలంగాణ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుంది. అనేక పథకాలలో ప్రాధాన్యత ఇస్తున్నారు. రుణాలు చెల్లింపులు, వ్యాపార, చిన్న పరిశ్రమల స్థాపనకు లింకేజీ రుణాలు అందిస్తున్నారు. అన్ని రంగాల్లో అవకాశం కల్పిస్తున్న ప్రభుత్వానికి మహిళలు రుణపడి ఉంటారు.

– ఈవూరి సుజాత, చెరువుమాధారం మాజీ సర్పంచ్

డివిజన్లలో కమిషనర్ ఆకస్మిక తనిఖీ

ఖమ్మంఅర్బన్: శానిటేషన్ విజిట్‌లో భాగంగా నగరంలోని పలు డివిజన్లలో శుక్రవారం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య పారిశుద్ధ్యంపై ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 2, 4 డివిజన్లలో పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి రోజువారి పనులు గురించి తెలుసుకున్నారు. అనంతనం కమిషనర్ మాట్లాడుతూ.. డివిజన్లలో నీరు ఆగకుండా చూడాలని, ఓపెన్ ప్లాట్లు శుభ్రం లేని యజమానులకు నోటీసులు అందించి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే 2వ డివిజన్‌లో సీసీ రోడ్లు, 13వ డివిజన్‌లో శానిటేషన్ పనులు, 60 డివిజన్‌లో డ్రెయినేజీ పనులను పరిశీలించి పలు ఆదేశాలు జారీ చేశారు. డివిజన్లలో ఏమైనా సమస్య ఉంటే అసిస్టెంట్ కమిషనర్ దృష్టికి తీసుకురావాలని శానిటరీ ఎస్‌ఐలకు సూచించారు. రోటరీనగర్‌లోని వీధి వ్యాపారుల మార్కెట్‌ను సందర్శించి సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్, ఈఈ కృష్ణలాల్, డీఈ ధరిణి, ఏఈ కుమార్, శానిటరీ సిబ్బంది, కార్పొరేటర్లు మరీదు వెంకటేశ్వర్లు, నీరజ తదితరులు ఉన్నారు.



2వ డివిజన్‌లో ఆరా తీస్తున్న కమిషనర్

కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి..

నగరంలోని 12వ డివిజన్‌లో వీధి కుక్కలు, కోతులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటిని అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ చిరుమావిళ్ల లక్ష్మినాగేశ్వరరావు శుక్రవారం కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యలపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ తెలిపారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ ముదిరాజ్ ఆధ్వర్యాన ముదిరాజ్‌లకు ప్రభుత్వం ఇచ్చిన అభయహస్తం హామీని వెంటనే అమలు చేయాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం దీనికి సంబంధించిన పోస్టర్లను ఖమ్మంలోని సంఘ కార్యాలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిట్టల వెంకటనర్సయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లబోయిన అశోక్, ఎన్నారై కన్వీనర్ దానబోయిన రాజ్‌కుమార్, మత్స్యపారిశ్రామిక ఖమ్మం జిల్లా చీఫ్ ప్రమోటర్ మామిళ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ముదిరాజులను బీసీ–డీ నుండి బీసీ–బీసీఏలోకి మార్చాలని డిమాండ్ చేశారు. ఈనెల 15 నుంచి 25వ తేదీ వరకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలు రెవెన్యూ అధికారులకు అందజేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు రావుల హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి గాదె రాంబాబు, కార్యదర్శి నర్ల శేషయ్య, ఉపాధ్యక్షుడు లింగబోయిన లక్ష్మణ్, పతానపు రామనాథం, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోటయ్య, నరసింహారావు, మల్లేశ్, మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం!

నేలకొండపల్లి: మండలంలోని అమ్మగూడెం గ్రామానికి చెందిన జి.పేరయ్య ఇంటి ఎదుట గురువారం అర్ధరాత్రి గుర్తు వ్యక్తులు క్షుద్ర పూజలు చేశారని ప్రచారంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. శుక్రవారం ఉదయం పేరయ్య ఇంటి ముందు గమనించగా పసుపు, కుంకమ, నిమ్మకాయలు కనిపించడంతో అవాక్కయ్యారు. ఎవరైనా క్షుద్రపూజలు చేశారా లేక ఇది ఆకతాయిల పనా అన్నది తేలాల్సి ఉంది.

పరామర్శ..

కామేపల్లి: ఇటీవల అనారోగ్యానికి గురై ఇంటి వద్ద విశాంత్రి తీసుకుంటున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గి కృష్ణను శుక్రవారం డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేకల మహేష్‌యాదవ్, పాటిబండ్ల ప్రసాద్, బూక్యా నాగేంద్రబాబు, నల్లమోతు వెంకటనర్సయ్య తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రఘునాథపాలెం/ఖమ్మంఅర్బన్/ఖమ్మంవ్యవసాయం/నేలకొండపల్లి/కూసుమంచి: మండలాల్లోని వివిధ సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఆయా సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు నేడు(శనివారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనేపథ్యాన రఘునాథపాలెం మండలం ఈర్లపుడి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. అలాగే ఖమ్మం నగరంలోని పారిశ్రామిక ప్రాంతం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు, 132/33 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, టౌన్–2 సెక్షన్ పరిధిలో ఉన్న 33/11 బురహాన్‌పురం సబ్‌స్టేషన్‌లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, టౌన్–1 సెక్షన్ పరిధిలోని 33/11 కేవీ దానవాయిగూడెం సబ్ స్టేషన్, 33/11 గాంధీచౌక్ సబ్ స్టేషన్లలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, టౌన్ సెక్షన్ పరిధిలోని 33/11 కేవీ రామాలయం సబ్‌స్టేషన్ 11 కేవీ ఖిలా బజార్ ఫీడర్ పరిధలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొన్నారు. అలాగే కూసుమంచి మండలం జీళ్లచెరువు, చేగొమ్మ విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నందున, వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

సన్మానాలు..

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరానికి చెందిన డాక్టర్ సుమకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శుక్రవారం నృత్య రత్న 2024 అవార్డు అందించి తెలంగాణ ప్రభుత్వం భాష సంస్కృతి శాఖ, కురగంటి చారిటబుల్ ట్రస్ట్ వారి సంయుక్త ఆధ్వర్యాన ఘనంగా సన్మానించారు. ట్రస్ట్ 27వ వార్షికోత్సవం సందర్భంగా ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆమె తన వైద్య వృత్తిని కొనసాగిస్తూ.. ఔత్సాహికుల కోసం ఓ సంస్థ ఏర్పాటు చేసి కూచిపూడి నృత్యాన్ని నేర్పిస్తుండడంతో ఈ అవార్డు దక్కింది.

బదిలీ ఉపాధ్యాయులకు..

ఖమ్మంరూరల్: మండలంలోని జలగంనగర్ ఉన్నత పాఠశాలలో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు సునీలారాణి, పద్మావతి, మాధవీలత, మీరాబీ, పీఈటీ రాజులను శుక్రవారం పాఠశాల ఆవరణలో తోటి ఉపాధ్యాయులు ఘన సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ శ్యాంసన్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేసి విద్యార్థుల భవిష్యత్‌కు పూలబాటలు వేయాలని తెలిపారు. ఈ ఏడాది పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అనాథశవానికి అంత్యక్రియలు



మృతదేహం వద్ద ఫౌండేషన్ బాధ్యులు

ఖమ్మంవైద్యవిభాగం: ఇటీవల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలో పడిపోయి ఉన్న 60 ఏళ్ల వృద్ధుడికి ఆస్పత్రిలో చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరచగా.. అతడి ఎవ్వరూ రాకపోవడంతో అనాథశవంగా భావించి వైద్యశాల సిబ్బంది, ఓపీ పోలీసులు అన్నం సేవా ఫౌండేషన్ ద్వారా నగరంలోని బల్లేపల్లి వైకుంఠధామంలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

నేలకొండపల్లి: తొర్రూర్ ఎస్సైపై చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట యువజన సంఘం ఉపాధ్యక్షుడు పసుమర్తి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకుర్తి ఎమ్మెల్యేను సమస్యలపై ప్రశ్నించినందుకు మాళోవత్ సురేష్‌ను ఎస్సై తీవ్రంగా కొట్టాడని, ఫ్రెండ్లీ పోలీసు అంటూనే ఇలా ఏకపక్షంగా దాడి చేయడం సరికాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయని, ఎస్సైపై చర్యలు తీసుకోకుంటే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

వినతుల వెల్లువ

సాగు భూములకు దారి చూపించాలి



మంత్రి పొంగులేటికి సమస్యను వివరిస్తున్న బాధితులు

నేలకొండపల్లి: మండలంలోని తిరుమలాపురం రెవెన్యూ పరిధిలో ఉన్న తమ వ్యవసాయ భూములకు దారిని మూసేశారని, తమకు న్యాయం చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని బాధిత రైతులు వేడుకున్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం సీపీఐ మండల కార్యదర్శి కర్నాటి భానుప్రసాద్ ఆధ్వర్యాన కలిసి వినతి పత్రం సమర్పించారు. తిరుమలాపురంలో ఇటీవల కొంత మంది రైతులు దారి లేకుండా కంచె ఏర్పాటు చేశారని, దీంతో రెండేళ్ల నుంచి దాదాపు 55 ఎకరాలు బీడుపడి ఉంటున్నాయని పేర్కొన్నారు. సమగ్ర సర్వే చేసి కంచె తొలిగించి డొంకదారి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు గిరిజన సంఘం రైతులు పాల్గొన్నారు.

పర్మినెంట్ ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: నగరాన్ని పరిశుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యాలు కాపాడుతున్న మున్సిపల్ కార్మికులకు రోగాలు వస్తే చూపించుకునేందుకు ఖమ్మంలో పర్మినెంట్ ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.రామయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఈమేరకు కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్‌కు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ.. మయూరి ఆస్పత్రిలో ఈఎస్ఐ ఏర్పాటు చేశారని, కార్మికులు రోగాలతో అక్కడకు వెళ్తే మందులు ఇచ్చే పరిస్థితి లేదని, వైద్య పరీక్షలన్నీ బయట ఆస్పత్రుల్లో చేయిస్తున్నారన్నారు. పర్మినెంట్ ఆస్పత్రి ఏర్పాటు చేసి అవసరమైన రక్షణ పరికరాలను అందించాలని, పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, డైలీ వేజ్ కార్మిక వ్యవస్థను రద్దు చేయాలన్నారు. కార్మికులకు కనీసం వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాలు సంఘ నగర అధ్యక్షుడు ఎం.లక్ష్మీనారాయణ, నగర కార్యదర్శి కె.శ్రీనివాస్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు దున్న గురవయ్య, కిన్నెర నారాయణ, వీరబాబు, యాదక్క, శ్రీనివాసరావు, రవి, మహేష్, జాని, పార్థు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం నగర పాలక అనుమతులు లేకుండా నిర్మాణం చేస్తున్న అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కే.వీ.కృష్ణారావు డిమాండ్ చేశారు. శుక్రవారం వివిధ సంఘాల నాయకులతో పాటు బాధితులతో కలిసి కేఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విషయమై పలు దఫాలుగా విన్నవించిన అధికారులు స్పందించడం లేదని, పైగా ఫిర్యాదు చేసిన వారిపైనే కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, సాహెూ, హనుమంతరావు, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయక్, ఉపేంద్రబాయి, ఝాన్సీ, స్పందన, అనంతలక్ష్మి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

బాలికల పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ ఏర్పాటు చేయాలి

కామేపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అనుబంధంగా ఇంటిగ్రేటెడ్ బాలికల పోస్ట్‌మెట్రిక్ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యాన తహసీల్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సుధాకర్‌కు అందించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మస్తాన్ మాట్లాడుతూ.. కళాశాలకు అనుబంధంగా హాస్టల్ ఏర్పాటు చేయాలని, ప్రతీ గ్రామానికి బస్ సౌకర్యం కల్పించాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే పీడీఎస్‌యూ ఆధ్వర్యాన ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాంధీ, వెంకటేష్, నరసింహ, రవికుమార్, చందు, విద్యార్థులు పాల్గొన్నారు.

'స్తంబాద్రి'లో బ్రెయిన్ ట్యూమర్ శస్త్రచికిత్స



కోలుకున్న లక్ష్మితో డాక్టర్ సురేష్

ఖమ్మంవైద్య విభాగం: ఖమ్మం నెహ్రూ నగర్‌లోని స్తంభాద్రి ఆస్పత్రిలో 85 ఏళ్ల వృద్ధురాలికి బ్రెయిన్ ట్యూమర్ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. ఈ వివరాలను న్యూరో సర్జన్ గట్టినేని సురేష్ శుక్రవారం వెల్లడించారు. వరంగల్ జిల్లాకు చెందిన లక్ష్మికి ఫిట్స్‌తో అపస్మారక స్థితికి చేరగా తమ ఆస్పత్రిలో చేర్పించారని తెలిపారు. ఆమె మెదడులో గడ్డ ఉన్నట్లు గుర్తించి శస్త్రచికిత్స ద్వారా తొలగించామని చెప్పారు. ఇలాంటి సర్జరీలు హైదరాబాద్ వంటి నగరాల్లో మాత్రమే చేస్తారని, తమ ఆస్పత్రిలోనూ విజయంతంగా నిర్వహించగా లక్ష్మిని శుక్రవారం డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు.

సద్వినియోగం చేసుకోండి

నేలకొండపల్లి: యూనియన్ బ్యాంక్, ఎల్ఐసీ సంస్థలు కలిసి చేసే టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ చెక్కును నేలకొండపల్లికి చెందిన వెంకమ్మకు శుక్రవారం నేలకొండపల్లి యూనియన్ బ్యాంక్ మేనేజర్ వి.రాజేశ్వరరావు అందించారు. వెంకమ్మ భర్త వెంకయ్య గంగిరెద్దులు ఆడిస్తూ జీవనం సాగించే క్రమంలో వడదెబ్బకు గురై మృతి చెందాడు. టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ చేయించుకోవడంతో సంస్థ అతడి భార్యకు రూ.10 లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. టర్మ్ లైఫ్ బీమాలో 60 ఏళ్ల వరకు స్త్రీ, పురుషులు చేరొచ్చని ఏడాదికి రూ.1550 చెల్లిస్తే సహజ మరణానికి రూ.10 లక్షలు, 70 ఏళ్ల వరకు రూ.306 ప్రీమియం చెల్లిస్తే ప్రమాదంలో మృతి చెందితే రూ.30 లక్షలు పాలసీ చెల్లిస్తుందన్నారు. పేదలు ఇటువంటి బీమా పాలసీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు వంగవీటి లక్ష్మణ్‌కుమార్, శ్రీకాంత్, వాసు, రామకృష్ణ, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్ క్యాంపస్ పరిశీలన

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలో గల ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు శుక్రవారం టాస్క్ ఆధ్వర్యాన హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్ ఎస్ఈజెడ్ క్యాంపస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోపాల్ మాట్లాడుతూ.. మొత్తం 86 మంది విద్యార్థినులకు సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, సిమ్రాన్‌లు పరిశ్రమ తాజా సాంకేతిక పురోగతిపై సలహాలు అందించారని తెలిపారు. కళాశాల చైర్మన్ కె.నవీన్, కె.సంధ్యారాణి, వైవీ రాణి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం సహకారనగర్: నేషనల్ ఎయిరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్(నాసా) సెటిల్‌మెంట్ కాంటెస్ట్‌లో నగరంలోని శ్రీవిద్యానికేతన్ సీబీఎస్ఈ క్యాంపస్ విద్యార్థులు జాతీయస్థాయిలో ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించినట్లు శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్యలు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించి మాట్లాడారు. డీజీఎం చేతన్ మాదూర్, కో ఆర్డినేటర్ కృష్ణారావు, ప్రిన్సిపాల్ విజయ, డీన్ ప్రకాశరావు పాల్గొన్నారు.

బ్యాగ్‌లు అందజేత

ఖమ్మం సహకారనగర్: నగరంలోని మోమినాన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలల విద్యార్థులు మొత్తం 320 మందికి చేతన ఫౌండేషన్, విద్యార్థి ప్రజ్ఞల ఆధ్వర్యాన బ్యాగ్‌లు అందించినట్లు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మన్ శోభారాణి, ఫౌండేషన్ల బాధ్యులు సీతారామయ్య, ఆదిత్యకుమార్, కార్పొరేటర్ అమృతలు పేర్కొన్నారు. పాఠశాల హెచ్‌ఎం జానకి,సిబ్బంది పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వాసవీక్లబ్ ఆధ్వర్యాన నోట్ పుస్తకాలను సమకూర్చగా శుక్రవారం వాటిని తహసీల్దార్ సురేష్‌కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వరగాని లక్ష్మీనారాయణ, జిల్లా ఇన్‌చార్జ్ బీవీ నర్సింహారావు, చైర్మన్ కందిబండ వెంకన్న, మాజీ ఎంపీటీసీ కొమిరెల్లి లింగారెడ్డి, క్లబ్ సెక్రటరీ రంగయ్య, హెచ్‌ఎం స్వర్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ మాట్లాడుతూ.. పెండింగబకాయిలు చెల్లించకపోవడంతో గత మూడేళ్లుగా ప్రైవేట్ యాజమాన్యాల ఒత్తిడికి ట్యూషన్ ఫీజులు చెల్లించలేక, పై చదువులకు వెళ్లలేక 16 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న విద్యార్థి సంఘాల నాయకులను ఈ ప్రభుత్వం అరెస్ట్ చేస్తుందని అన్నారు. మెస్, కాస్మోటిక్స్ చార్జీలు పెంచాలని, అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, ప్రభుత్వ విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సుధాకర్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సంగీత, జిల్లా ఉపాధ్యక్షులు బెజవాడ సాయిశేషు, వంకాయల రాజు, సహాయ కార్యదర్శులు ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, విద్యార్థులు